ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం | 22 డిసెంబరు, 2025 | పేజీలు : 06

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం

## జాతీయ స్థాయి ఉద్యమాలకు సిద్ధం

2లో




సర్పంచ్‌లకు

# సమస్యల స్వాగతం







- గ్రామాల్లో కనీస సౌకర్యాలు మృగ్యం
- పంచాయతీలకు నిధులు లేక సతమతం
- ప్రత్యేకాధికారుల పాలనలో అస్తవ్యస్తం
- కొత్త వారిపై గ్రామీణుల కోటి ఆశలు

**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. పంచాయతీలకు కొత్త పాలక వర్గాలు వచ్చాయి.నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లపైనే గ్రామీణులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్లుగా పాలకవర్గాలు లేక ప్రత్యేక పాలనలో కునారిల్లిన గ్రామాలు కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యుల సారథ్యంలో ఇకనైనా అభివృద్ధి కూటపడతాయని ఆశిస్తున్నారు. ఈనెల 22న కొత్త సర్పంచులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అప్పటి నుంచి వారి పదవీకాలం అమలులోకి వస్తుంది. ఈ నేపథ్యంలో గ్రామాలు, వాటిలో పేరుకుపోయిన సమస్యలు, వాటిని పరిష్కరించే విషయంలో సర్పంచ్ లపై ప్రధాన బాధ్యత నెలకొన్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,708 గ్రామ పంచాయతీలున్నాయి. వరంగల్లో 317, హనుమకొండ జిల్లాలో 210, జనగామ జిల్లాలో 280, మహబూబాబాద్ జిల్లాలో 482, ములుగు జిల్లాలో 171, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 248 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస సౌకర్యాలు లేక పల్లె ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్రామాల అభివృద్ధికి తరువాయి 2లో




## నేడు కొలువు తీరనున్న జిపి కొత్త పాలక వర్గాలు

- జిల్లాల్లో 248 మంది సర్పంచ్‌లు ప్రమాణ స్వీకారం
- సర్పంచ్ లకు సవాల్‌గా మారనున్న సమస్యలు

2లో

## బెజ్జంకిలో విషాదం

పురుగుల మందు తాగి దంపతుల ఆత్మహత్య



2లో

## నేటి ప్రజావాణి కార్యక్రమం తాత్కాలిక రద్దు

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**వరదలు, పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాల వంటి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహణలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో పాల్గొంటున్న నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యంగా విపత్తు నిర్వహణపై అవగాహన, సమన్వయం పెంపొందించేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వాములవ్వడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు
కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీనివాసగార్డెన్‌లో మండల ఇంచార్జి బండకింది హరిబాబు అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కడా నిరాశ చెందొద్దని, గెలిచిన సర్పంచ్ అభ్యర్థులను అభినందించారు. ఓటమి చెందిన అభ్యర్థులు కూడా మనోధైర్యాన్ని కోల్పోవద్దని పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట మాజీ సర్పంచ్ బాలకిషన్, సర్పంచ్‌లు తరువాయి 2లో

# సర్పంచ్‌లకు సమస్యల స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

అనేక పథకాలను అమలు చేస్తున్నట్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేసుకుంటున్నా ఆచరణలో మాత్రం అది ఎక్కడా కనిపించడం లేదు. పల్లెల అభివృద్ధికి నిధుల కొరత ప్రధాన అడ్డంకిగా మారింది. దీనికి తోడు సిబ్బంది కొరతవల్ల కూడా పంచాయతీల పాలన అటకెక్కుతోంది. వివిధ సమస్యలపై గ్రామపంచాయతీ కార్యాలయాలకు వచ్చే గ్రామీణులకు నిరాశే ఎదురవుతున్నది. పంచాయతీ ఎన్నికల్లో నోట్లు, మద్యం పంపిణీ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి పంచాయతీలను ప్రగతి పథంలో నడిపించే బాధ్యత వారిపై ఉంది. కాస్త అటు ఇటుగా అన్ని గ్రామాలు సమస్యలు ఒకటే నిధుల లేమి, సిబ్బంది కొరత, అనేక సమస్యలు నెలకొన్నాయి.

## పంచాయతీలను వేధిస్తున్న నిధుల కొరత

గ్రామ పంచాయతీలను నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జనాభా ప్రాతిపదికన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు చాలినంతగా ఇవ్వడం లేదు. ఈ విషయం లో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహ రిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. మేజర్ పంచాయ తీల సంగతి అటుంచితే చిన్న పంచాయతీలకు నిధుల విడుదలలో జాప్యంతో పా టు వాటికి ఆదాయ వనరులు అంతగా లేకపో వడం వల్ల పనులు జరగక అభివృద్ధిలో వెనుకట డిపోతున్నాయి. కార్మికులకు వేతనాలు కూడా చెల్లించ లేని పరిస్థితి ఉంది. గత ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను ప్రకటించినా వాటి అమలుకు అశించిన మేర నిధులు ఇవ్వలేదు. సర్పంచులే తమ సొంత డబ్బుల తో వివిధ అభి వృద్ధి పనులను చేశారు. పాలకవర్గాల కాలపరిమితి ముగిసే నాటికి కూడా బకాయి లు చెల్లించకపోవ డంతో వారు ఆర్థికంగా చితికిపో యారు. కొందరైతే చేసిన అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా సర్పంచ్‌లంతా సంఘటితం కావాలి. జీపీలకు ప్రభుత్వా లు ఇచ్చే నిధులపైనే పూర్తిగా ఆధార పడకుండా ఇంటి పన్నులు, తదితర ఆదాయ మార్గాల ను పెంచుకోవడం ద్వారా నిధులను సమకూర్చుకోవాలి.

## పంచాయతీల్లో సమస్యల తిష్ఠ

పంచాయతీల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. మేజర్, చిన్న పంచాయతీలు అన్నింటిలో ఇదే పరిస్థితి, నిధులు లేక చిన్నపాటి మరమ్మతులు కూడా కరువయ్యాయి. మురుగుకాలువలు దారుణంగా తయారయ్యాయి నిర్వహణ లోపంతో కాలువ గట్లు, సిమెంట్ రోడ్లు ధ్వంసమవుతున్నా యి. వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. అంతర్గ త రోడ్లు మరమ్మతు లేక పూర్తిగా ధ్వంసమైన స్థితిలో కని పిస్తున్నాయి. పంచాయతీల్లోని చాలా వీధులకు ఇప్పటివర కు సీసీ రోడ్లు లేవు. కాలువల నిర్మాణం లేక మురుగు నీరంతా రోడ్ల మీదనే పారుతున్నాయి. ఈ సమస్యలపై కొత్త సర్పంచులు ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాల్లో మొదట 1,008 జీపీలు ఉండేవి. పునఃవ్యవస్థీకరణ ఫలితంగా వాటి సంఖ్య 1,7084 చేరుకుంది. కొత్తగా ఏర్పాటైన పంచాయతీల్లో చాలా వాటికి ఇప్పటి వరకు ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించలేదు. కొన్నింటికి నిధులు మంజూరు చేసినా వివిధ కారణాల వల్ల ఆ భవనాల నిర్మాణం పూర్తికాలేదు నిధుల కొరతవల్ల మరి కొన్ని మిగిలిపోయాయి. ఉమ్మడి జిల్లాలో 650 పంచాయతీలు ఇప్పటికీ అద్దె భవనాల్లో మగ్గుతున్నాయి.

## కొన్ని చోట్ల సిబ్బంది కొరత

జీపీలను సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. గత ప్రభుత్వం 500 జనాభా కలిగిన తండాలను జీపీలుగా ఏర్పాటు చేసింది. అమేరకు సిబ్బందిని నియమించలేదు. ఉన్న ఉద్యోగులనే సర్దుబాటు చేసింది. ప్రతీ జీపీలో కార్యదర్శితో పాటు ఒక జూనియర్, సీనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్లు, తగినంత పారిశుధ్య కార్మికులు, ఇతర సహాయక సిబ్బంది ఉండాలి. కానీ చాలా పంచాయతీల్లో సరిపడా ఉద్యోగులు లేరు.ఇద్దరు, ముగ్గురు చేయాల్సిన పనులను ఒక్కరే చేస్తున్నారు. సిబ్బంది లేక పల్లెల్లో పారిశుధ్యం క్షీణిస్తోంది. నల్లాలు, విద్యుద్దీపాల పర్యవేక్షణకు వాటర్, లైన్ మెన్లు లేరు. చెత్తను తరలించడానికి బలవంతంగా ట్రాక్టర్లు కొనిపించినా వాటికి డ్రైవర్లు లేరు. బిల్ కలెక్టర్లు లేక ఇంటి పన్నుల వసూలు కావడం లేదు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పంచాయతీలను నిర్వహిస్తున్నారు. సర్పంచులు అన్ని వసతులతో కూడిన పంచాయతీ భవనాల నిర్మాణానికి కృషి చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు శ్రమించాల్సి ఉంది.

## రెండేళ్లుగా అభివృద్ధిలో వెనకబాటు

రెండేళ్లుగా పాలకవర్గాలు లేక పోవడం వల్ల పంచాయతీ పాలనలో జవా బుదారీతనం కొరవడుతోంది పరిపాలన, అభి వృద్ధి కుంటు పడింది. గ్రామాలన్నీ అస్తవ్య స్తంగా మారాయి. ప్రత్యేక అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోలేదు. తమ పరిపాల నా సామర్థ్యం, ప్రజాప్రతినిధులతో కలిసి పల్లెల అభివృద్ధిని గాడి లో పెట్టాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో అనేక గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. కొన్ని గ్రామాలకు కాలినడకే శరణ్యం మరికొన్ని గ్రామాలకు మట్టి రోడ్లు ఉండడంతో వర్షాకాలంలో గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. ఈ గ్రామాల కు బస్సులు సైతం వెళ్లడం లేదు. ఉమ్మడి జిల్లాలో 2 వేలకు పైగా గ్రామాల కు బస్సు సౌకర్యం లేదు. ఈ విష యంలో నూ సర్పంచులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

## రోడ్డు ప్రమాదం వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై జనగామ నుండి వస్తూ నిడిగొండ వద్ద ఒక్కసారిగా తన వాహనాన్ని యూటర్న్ చేస్తుండగా అదే వైపు నుండి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా ఆ ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బానాజీపేట గ్రామానికి చెందిన బత్తోజు విష్ణు బైక్‌పై జనగామ నుంచి తిరిగి వస్తున్న క్రమంలో నిడిగొండ బస్టాండ్ సమీపంలో బ్రిడ్జి దగ్గర కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో విష్ణును 108 అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## శాంతియుతంగా సర్పంచ్‌ల ప్రమాణస్వీకారాన్ని నిర్వహించుకోవాలి

**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యుల ప్రమాణ స్వీకరణ మహోత్సవ కార్యక్రమాన్ని శాంతి యుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ బి.సౌజన్య ఆదివారం




ఒక ప్రకటనలో తెలిపారు.డీజే సౌండ్స్,ర్యాలీలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని అన్నారు.ప్రమాణ స్వీకారం చేపడుతున్న ఆయా గ్రామాల పాలకవర్గ సిబ్బందికి పోలీస్ శాఖ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

## మందపల్లి స్రర్పంచ్ అర్చన శ్రీనివాస్‌రెడ్డికి ఘన సన్మానం

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామ నూతన సర్పంచ్ అర్చన శ్రీనివాస్‌రెడ్డిని, ఆ గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అర్చన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులందరూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని,గ్రామంలోని మిగతా కుల సంఘాలకు ఆదర్శంగా నిలువాలని,సామాజిక అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సంఘం అభివృద్ధికి తనవంతు సహాకారం అందిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు బెంద్రం రాజిరెడ్డి,గౌరవ అధ్యక్షుడు నేరెళ్ల



వెంకట్‌రెడ్డి,కోశాధికారి రాజవెంకట్‌రెడ్డి,సంఘం సభ్యులు రత్నాకర్‌రెడ్డి,బాపురెడ్డి,మేఘనాథ్‌రెడ్డి,మహేందర్ రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి,మహిళాసభ్యులు,సభ్యులుపాల్గొన్నారు.

# కొలువుదీరనున్న కొత్త సర్పంచ్‌లు

### సమస్యలతో స్వాగతం పలుకుతున్న పంచాయతీ భవనాలు

**ప్రజాపక్షం/రామాయంపేట:** గ్రామ పంచాయతీల్లో కొత్త సర్పంచులు బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధమవుతున్న వేళ పంచాయతీ భవనాలు మాత్రం పేరుకుపోయిన సమస్యలతో వారికి స్వాగతం పలుకుతున్నాయి. సుమారు గత రెండు సంవత్సరాలుగా గ్రామాల్లో పాలకవర్గం లేకపోవడం వల్ల అభివృద్ధి నిలిచిపోయి, మౌళిక వసతులు క్షీణించాయి. ఇప్పుడు కొత్త పాలకవర్గం వస్తుందన్న ఆశతో గ్రామస్థులు తమ ఇబ్బందులు తీరుతాయనే దీమాతో ఉన్నారు. పంచాయతీ కార్యాలయాల నిర్వహణ లేకపోవడంతో భవనాలు కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. తాగునీటి సమస్య పారిశుద్యం, లోపించడం, మురుగు కాలువలు లేకపోవడం, వీది దీపాలు పనిచేయకపోవడం వంటి సమస్యలు సాదారణమయ్యాయి. అనేక పంచాయతీ కార్యాలయాల్లో మౌళిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ అభివృద్ధికి కీలకమైన రోడ్లు మరమ్మత్తులకు నోచుకోక గుంతలమయంగా మారాయి. వర్షాకాలంలో నీరు నిలిచి ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల చుట్టూ పారిశుద్య సమస్యలు నెలకొన్నాయి. కొత్తగా ఎన్నికైన సర్పంచులు బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ సమస్యలపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వం నుండి వచ్చే నిదులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులు చేపడుతారని ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుద్య పనులు, వీది దీపాల ఏర్పాట్లు, రోడ్ల మరమ్మత్తులు వంటి అంశాలను ప్రాదాన్యంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. పాలకవర్గం లేకపోవడంతో ఇన్నాళ్లు నిలిచిపోయిన పనులను పదవి చేపట్టే పాలకవర్గం ముందుకు సాగేలా కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. రామాయంపేట మండలంలో కొన్ని గ్రామాలకు పంచాయతీ భవనాలు కూడా లేకపోవడంతో అద్దె భవనాల్లో నడిపిస్తున్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం జాతీయ స్థాయి ఉద్యమాలకు సిద్ధం

**ప్రజాపక్షం/జనగామ:** ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే జాతీయ స్థాయి ఉద్యమాలకు సిద్దంగా ఉన్నామని అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయులకు భారమవుతున్న బోధనేతర పనులకు దూరంగా ఉంచాలని టీఎస్ యూటీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేకర్ రావు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28, 29వ తేదీలలో జిల్లా కేంద్రంలో జరిగే విద్యా సదస్సును, రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రంజిత్‌కుమార్, వెంకటేష్, శ్రీనివాసరావు, శ్రీనివాస్, కందుల శ్రీనివాస్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

నర్సింగరావు, రాములు, రవీంద్రనాథ్, రేణుక కమలాకర్, శ్రీనివాస్, నరసమ్మ మల్లయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు:మండల ఇంచార్జి బండకింది హరిబాబు, మాజీ ఎంపీటీసీ ఎండీ మసూద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో మండల కాంగ్రెస్ పర్టీలో భారీగా చేరికలు జరిగాయి. కొడవటూర్ గ్రామానికి చెందిన రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షుడు మిన్నలాపురం జలంధర్‌ని ప్రశాంత్ రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం అందరు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సిద్ధు, రవి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొలువు తీరనున్న జిపి కొత్త పాలక వర్గాలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** నేడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యా ప్తంగా నూతన గ్రామపంచాయతీలకు నూతన పాలకవర్గం కొలువు తీరని ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 12 మండలాల పరిధిలో 248 గ్రామ పంచాయతీలకు నూతనంగా సర్పంచులు ఇటీవల జరిగిన 11,14,17 మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే సర్పంచుల పదవి కాలం ముగియడంతో సుమారు రెండు సంవత్సరాల అనంతరం గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 248 గ్రామపంచాయతీ పరిధిలో ఎన్నికలు నిర్వహించగా ఎట్టకేలకు నేడు అన్ని గ్రామపంచాయతీలలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నూతనంగా గెలుపొందిన సర్పంచులకు గ్రామంలో ఉన్న అనేక సమస్యలు సవాల్గా మారనున్నాయి. గత ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న పనులతో పాటు గ్రామంలో ఉన్న అనే క సమస్యలు నూతల సర్పంచులకు దర్శనం ఇవ్వనున్నాయి. అనేక సమస్యలను ఎదుర్కొని నూతన సర్పంచులు గ్రామాభివృద్ధికి పాటుపడే విధంగా ఎలాంటి చర్యలు చేపడతారో చూడాల్సిందే.

## బెజ్జంకిలో విషాదం

**ప్రజాపక్షం/బెజ్జంకి :** అప్పుల బాధలు భరించలేక దంపతులు పురుగుల మందు తాగి ఆతహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా బెజ్జం కి మండల కేంద్రంలో ఆదివారం రోజున చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల మేరకు దాచారం గ్రామానికి చెందిన వడ్లకొండ శ్రీహర్ష (32),రుక్మిణి (27) దంపతులు వీరికి కూతురు హరిప్రియ (3) ఉంది. మండల కేంద్రంలోని అద్దె భవనంలో రెండు సంవత్సరాలుగా బట్టల దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.తన స్నేహితుల వద్ద 13 లక్షల అప్పు వ్యవహారంలో మధ్యవర్తిగా ఉన్నాడు.తిరిగి అడిగే క్రమంలో వారు ఇబ్బందులకు గురి చేయడంతో డబ్బులు చెల్లించ లేక అవమానాలకు గురై మనస్థాపం చెంది అప్పు విషయంలో వేధించిన వారి పేర్లు సూసైడ్ నోట్ రాసి భార్యతో సహ గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.మృతుడి తండ్రి వడ్లకొండ శ్రీనివాస్ ఇచ్చిన పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.సౌజన్య తెలిపారు.

## సర్పంచ్‌ను అభినందించిన పెన్షనర్ల సంఘం సభ్యులు



**ప్రజాపక్షం/రాయపర్తి:** ఇటీవల రాయపర్తి సర్పంచ్‌గా ఎన్నికైన గారె సహేంద్ర బిక్షపతిని మండల కేంద్రంలోని కొత్త రాయపర్తి కాలనీలోని వారి నివాసంలో ఆదివారం సీనియర్ సిటిజన్స్ కమిటీ, మండల పెన్షన్ సంఘం అధ్యక్షుడు ఎండి ఉస్మాన ఖాన్, కార్యదర్శి రావుల భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ మాట్లాడుతూ గ్రామంలో పేరుకుపోయినటువంటి అనేక రకాలైన సమస్యలను సత్వరమే ప్రజాస్వామ్యబద్ధంగా ధర్మబద్ధంగా పరిష్కరించాలని కోరారు. విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అనేక రకాలైన సామాజిక సమస్యలను పరిష్కరించే దిశలో సీనియర్ సిజిజన్ల కమిటీ, మండల పెన్షన్ సంఘం పూర్తి స్థాయిలో సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఆకుల నరేందర్ రావు, గౌరవ సలహదారు ఉప్పు రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**వరంగల్ జిల్లా కాశిబుగ్గలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పెండేల సంపత్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించిన బిసి సర్పంచ్‌లకు, టిఆర్‌పి సర్పంచ్‌లకు వరంగల్ జిల్లా కమిటీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. బిసి రాజ్యాధికారమే టిఆర్‌పి లక్ష్యమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిసెంట్ ధర్మపురి రామారావు, జిల్లా నాయకులు కొలిపాక సాంబశివుడు, చిర్ర రాజేష్ కన్న, అడ్డికిచర్ల చాణిక్య, బూర సురేష్, గరిగే జస్వంత్, గరిగే సుమతి, రాచర్ల రచన, రాచర్ల కళ్యాణి, అడుప రమాదేవి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/నల్లబెల్లి(నర్సంపేట):**ఇటివల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రొట్టె సురేష్ కుటుంబానికి పూర్వ విధ్యార్థులు ఆర్థిక సహాకారం అందించి ఆదుకున్నారు . ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని అర్షనపల్లి గ్రామానికి చెందిన రొట్టే సురేష్ రిపోర్టర్‌గా కొనసాగుతు గత పది రోజుల క్రితం నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు . మృతునికి ఇద్దరు కుమారులు ఉండటంతో పూర్వ విధ్యార్థులైన 2005 లో పదో తరగతి చదువుకున్నా విధ్యార్థులు ఎండి చాంద్‌పాషా ,పులిగుజ్జుల రఘు , జక్కుల నగేష్ ఆధ్వర్యంలో 20 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించి కుటంబానికి భరోసా కల్పించారు . ఈ కార్యక్రమంలో పూర్వ విధ్యార్థులు బత్తుల రాజేష్ ,పప్పు విజయ్‌కుమార్ ,బాడిసే కుమారస్వామి ,బోల్ల అనిల్ ,పులుకుర్తి రఘు ,ఎల్లబోయిన సుమన్ తదితరులు పాల్గోన్నారు .

# కోట్ల రహదారులు.. కేజీ వీల్స్‌కు బలులు!

### పాలకుల అభివృద్ధి.. పాలనా నిర్లక్ష్యం మధ్య నలిగిపోతున్న గ్రామీణ రోడ్లు



**ప్రజాపక్షం/నెక్కొండ:** కోట్ల రూపాయలు వెచ్చించి శాసన స భ్యులు, పార్లమెంట్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు గ్రామాలకు బిటి, సిసి రోడ్లు వేసి ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు కల్పిస్తున్నామని గొప్పలు చెబుతున్న పాలకుల మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలకు పొంతన లేకుండా పోతోంది. గ్రామాల్లో తాజాగా వేసిన బిటి రోడ్లు కళ్ల ముందే నాశనం అవుతున్నాయి. కారణం చట్ట విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న కేజీ వీల్స్ ట్రాక్టర్లు, భారీ మోటార్లు, ఉదయం ఆరు గంటలకే కేజి వీల్స్ టాక్టర్ రోడ్లపైకి రావడంతో, కొత్తదనాన్ని మించిన రహదారులు కొద్ది రోజుల్లోనే చీలికలు, గోతులతో దయనీయ స్థితికి చేరుకుంటున్నాయి. భారీ వాహనాలు గ్రామీణ బిటి రోడ్లపై నడపరాదని గత ప్రభుత్వాలు స్పష్టమైన జీవోలు జారీ చేశాయి. అయినా ఆ జీవోలు కాగితాలకే పరిమితమై, గ్రామాల్లో అమలుకాని చట్టాలుగా మారాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జిపిఓలు ఈ నిబంధనలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. వారికి ఈ జీవోల గురించి తెలుసా? తెలియదా? లేక తెలిసిన పట్టించుకోవడం లేదా? అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ప్రజల పన్నుల డబ్బుతో వేసిన రోడ్లు, మరోవైపు అదే రోడ్లను నాశనం చేస్తున్న కెజి వీల్స్ వాహనాలు మధ్యలో నలిగిపోతున్నది మాత్రం సామాన్య ప్రజలేనని, రోడ్లు చెడితే ప్రమాదాలు, వాహనాల నష్టం, ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పాలకులు రోడ్లు వేసినంత మాత్రాన అభివృద్ధి పూర్తయినట్లు కాదని, వాటిని కాపాడే బాధ్యత కూడా ప్రభుత్వానిదేనన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది.

## నీటిని విడుదల చేయడానికి చేతకాని స్థానిక ఎంఎల్‌ఏ



**ప్రజాపక్షం/ఖానాపూర్:**పాకాల తైబందీపై ఎంఎల్‌ఏ మొండి వైఖరి వహిస్తున్నాడని మాజీ ఎంపిపి వేములపల్లి ప్రకాష్‌రావు, నర్సంపేట మాజీ ఎంపిపి వేములపల్లి ప్రకాష్ రావు, నర్సంపేట ఏఎంసి మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌లు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ మాజీ ఎంఎల్‌ఏ బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పెద్ది సుదర్శన్‌రెడ్డి ముందస్తు ప్రణాళికతో పాకాల చెరువుకు గోదావరి నీటిని ఖానాపూర్ మండల రైతాంగానికి రెండు పంటలకు అందించి రైతుల పక్షపాతి అయ్యాడు. విజైన్ కలిగిన నేత బిఆర్‌ఎస్ అధినేత బాపు కెసిఆర్‌ని ఒప్పించి, మెప్పించి నీటిని అందించి రైతులకు భరోసాను, రైతులు కళ్ళల్లో ఆనందాన్ని నింపాడన్నారు. కానీ నేడు పాకాల చెరువు నిండుకుండలా నీటితో కలకలలాడుతూ ఉంటే రైతులకు నీటిని అందించే సాహసం, ధైర్యం లేక సీజన్ అయిపోయే సమయానికి కూడా తైబందీ పై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా రైతులను గందరగోళానికి ఎంఎల్‌ఏ గురిచేస్తున్నారు. రైతులకు బాకీ పడ్డ రెండు పంటలకు బోనస్, రైతు భరోసా అందించకుండా కాలయాపన చేస్తూ ప్రభుత్వం మభ్య పెడుతుందన్నారు. నిన్నటి వరకు ఎడమొహం పెడ మొహం పెట్టుకున్న ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎల్‌ఏ నేడు మాటలు కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై కాకుండా ఒకరికి రియల్ ఎస్టేట్‌పై ప్రేమ, ఒకరికి స్వంత కాంట్రాక్టులపై ప్రేమతో, రైతులతో సాగునీటిపై ఒక విజన్ లేకుండా సూట్ కేసులు బస్తా సంచులు నింపుకుంటున్నారన్నారు. రైతులు సకాలంలో యూరియా అంధక రెండు తుఫాన్‌ల వలన గతంలో ఎన్నడూ లేని విధంగా దిగుబడి తగ్గి, పెట్టుబడి కూడా చేతికి రానటువంటి పరిస్థితులలో దుఃఖిస్తున్న రైతులు 20వేల ఎకరాలలో పంట నష్టం జరిగితే 2వేల ఎకరాలు మాత్రమే రైతుల పంట నష్టపోయారని నివేదిక అందించిన అధికారులు, పంట నష్టంపై స్థానిక లీడర్లు సర్వే చేయించి స్వంత పార్టీ రైతుల పేర్లతో నివేదిక పంపినను నష్టపరిహారం ప్రభుత్వం అందించలేదన్నారు. ఈ పాపం ఊరికే పోదని రానున్న ఎన్నికలలో చూపించే ఫలితాలు సాక్షాలవుతాయన్నారు. గ్రామాల్లో మిమ్మల్ని తరిమికొట్టే రోజులు వస్తాయన్నారు. ఇప్పటికైనా రైతుల పక్షాన నిలబడి రైతుభరోసా, బోనస్‌లను అందించి పాకాల తైబందీ ఖరారు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎంఎల్‌ఏ క్యాంప్ కార్యాలయాన్ని రైతులు, పార్టీ శ్రేణులు కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ దాసరి రమేష్, వార్డు సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలలో బిఆర్‌ఎస్ దెబ్బకు చతికిల పడ్డ కాంగ్రెస్ పార్టీ



**ప్రజాపక్షం/రాయపర్తి:** స్థానిక ఎన్నికలలో బిఆర్‌ఎస్ పార్టీ దెబ్బకు కాంగ్రెస్ పార్టీ చతికిల పడిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక ఎన్నికలలో గెలిచిన బిఆర్‌ఎస్ పార్టీ సర్పంచ్, వార్డు సభ్యులను అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నతల్లి లాండి బిఆర్‌ఎస్ పార్లీ ఉంటూ పార్టీకి నమ్మక ద్రోహం చేస్తున్న ద్రోహులను వదిలిపెట్టేది లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అధికార మదంతో అధికారులతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఎన్నో ప్రలోభాలకు గురి చేసిన తట్టుకొని నిలబడి విజయం సాధించిన బిఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్‌ల పోరాట పటిమ అద్భుతమని కొనియాడారు. గత ఎంఎల్‌ఏ ఎన్నికలలో పాలకుర్తి నియోజకవర్గంలో మండలంలో 60 శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ, సర్పంచ్ ఎన్నికలలో 30 శాతానికి పడిపోవడానికి దేనికి నిదర్శనమన్నారు. ఎంఎల్‌ఏ ఎన్నికలలో 31 శాతం ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికలలో 65 శాతం ఓట్లు సాధించి పూర్వ వైభవం ప్రదర్శించి కాంగ్రెస్ పార్టీ నాయకత్వ అహంకారానికి అడ్డుకట్ల వేస్తూ దూసుకెళ్తుందని అన్నారు.ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ బిఆర్‌ఎస్ పార్టీ మంచి ఆదరణ పొంది రాబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలలో ముందంజలో ఉండడం ఖాయమన్నారు. అధికారాన్ని, పోలీసులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎన్నికలకు తెలంగాణ ప్రజలు ఓటుతోనే గట్టి గుణపాఠం చెప్పారన్నారు. డబ్బు సంచులతో ప్రలోభపెట్టాలని చూసినా, బెదిరింపులకు పాల్పడినా ప్రజలు మాత్రం గులాబీ జెండా వైపే నిలిచారని, నామినేషన్ల దశ నుండే మన అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. ఏకగ్రీవాల పేరుతో బెదిరించారని, అయినా సరే మన కార్యకర్తలు, నాయకులు గులాబీ జెండాను వదలలేదని అన్నారు. ఈ గెలుపు బిఆర్‌ఎస్ కార్యకర్తల మనోధైర్యానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, మండలాధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్, మాజీ ఎంపిపి జినుగు అనిమిరెడ్డి, జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదరిశ పూస మధు, మాజీ ఫ్యాక్స్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, బందేల బాలరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నెక్కొండ నుండి రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగిన వెంకట్ గౌడ్

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం జన్మస్థలంగా, గౌడ సామాజిక వర్గానికి చెందిన మడత వెంకట్ గౌడ్ తన కృషి, నిబద్ధతతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందుతున్న నాయకుడిగా ఎదుగుతున్నారు. ఆర్థికంగా స్థిరపడిన కుటుంబ నేపథ్యం ఉన్నప్పటికి, సామాజిక బాధ్యతను మరవకుండా ప్రజా జీవితంలో ముందుకు సాగడం ఆయన ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. కోట్ల రూపాయల ఆస్తి సంపాదించిన వెంకట్ గౌడ్ కుటుంబం నెక్కొండ మండల ప్రజలకు సుపరిచితమే. ముఖ్యంగా ఆయన తల్లి మడత సత్తెమ్మ మండల వ్యాప్తంగా ప్రజలతో మమేకమై, అప్యాయతతో కూడిన సేవాభావం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. అలాంటి కుటుంబ సంస్కారం నుండి వచ్చిన వెంకట్ గౌడ్ రాజకీయాల్లోకి అడుగు బెట్టి తనదైన ముద్ర చేశారు. ఖమ్మం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీ చైర్మన్‌గా వెంకట్ గౌడ్ భార్య గతంలో బాధ్యతలు నిర్వహించి, ప్రజాప్రతినిధిగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఇది మడత కుటుంబం ప్రజాసేవ పట్ల ఎంత నిబద్ధంగా ఉందో చెప్పే ఉదాహరణగా నిలుస్తోంది. వెంకట్ గౌడ్ కాంగ్రెస్ పార్టీకి ఆది నుండే నమ్మకస్తుడిగా కొనసాగుతున్నారు. యువజన కాంగ్రెస్ నాయకుడిగా అనేక ఉద్యమాల్లో పాల్గొని, పార్టీ బలోపేతం కోసం కష్టపడ్డారు. పదవులు కన్నా సిద్ధాంతాలకే ప్రాధాన్యం ఇచ్చే నాయకుడిగా ఆయనకు పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎత్తులు, దిగువలు ఎదురైనా వెనక్కి తగ్గకుండా, ప్రజల మధ్యనే ఉండి రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించడం ఆయన రాజకీయ పరిపక్వతకు నిదర్శమన్నారు.

## రంగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన పరుపాటి

**ప్రజాపక్షం/రాయపర్తి:**మండలంలోని జగన్నాధపల్లి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు బద్దం రంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆయన చిత్రపటానికి ఆదివారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల మధుకర్‌రెడ్డి, పరుపాటి రవీందర్ రెడ్డి, అశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రగతి రథసారథులు సర్పంచులే



**ప్రజాపక్షం/సంగెం:**గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో, ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చడంలో సర్పంచ్‌ల పాత్రే అత్యంత కీలకమని హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత అన్నారు. వరంగల్ జిల్లా సంగెం మండలంలో ఆదివారం ఆమె సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఎల్గూర్ రంగంపేట గ్రామంలో.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీజేపీ తరపున గెలుపొందిన నూతన సర్పంచులను ఆమె శాలువాలతో సత్కరించి, ఘనంగా సన్మానించారు.

ప్రజలకు అందుబాటులో ఉండే వారికే పట్టంఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాధవీలత మాట్లాడుతూ.. గ్రామ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమించే వ్యక్తి గ్రామ సర్పంచ్ అని కొనియాడారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు. ప్రతి ఇంటి కష్టాన్ని తమ కష్టంగా భావించి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను, బీజేపీ అభ్యర్థులను గెలిపించుకున్నందుకు గ్రామ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు ఆమె ఎల్గూర్ రంగంపేట బ్రిడ్జిని పరిశీలించి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### ఘనంగా సన్మానం


కార్యక్రమంలో భాగంగా ఎల్గుర్ రంగంపేట సర్పంచ్ బెజ్జంకి శేషాద్రి, పంతిని సర్పంచ్ కన్నయ్య, పసరగొండ సర్పంచ్ కొట్టే శ్రీవాణిరమేష్, కాట్రయాల సర్పంచ్ ఎరుకల రమ్యలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల చంద్రమౌళి (సి.ఎం), రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



**ప్రజాపక్షం/తొర్రూరు:** మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన రాగి తిరుమలాచారి మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ ముద్దం విక్రంరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి అండగా ఉంటామన్నారు. ఆదివారం రాగి తిరుమలాచారి మృతి చెందగా ఆ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ముద్దం విక్రంరెడ్డి పరామర్శించి బియ్యం, ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా విక్రంరెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని, ప్రజల బాధల్లో పాలు పంచుకుంటానని చెప్పారు. ప్రజలకు ఏ కష్ట మొచ్చినా అండగా ఉంటానని అన్నారు.

## విద్యుత్ వైర్లు తగిలి ఎద్దు మృతి



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండలంలోని పోతారం గ్రామానికి చెందిన యాండబట్ల బాలనర్సయ్య ఎద్దులను మేతకు తీసుకెళ్లగా వంగా వెంకటేష్ వ్యవసాయ క్షేత్రం వద్ద తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ నియంత్రణకు ఎద్దు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.70వేలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తనని ఆదుకోవాలని వేడుకున్నారు.

## నూతన సర్పంచ్ మోహన్‌కి చిన్ననాటి మిత్రుల సన్మానం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి నూతన సర్పంచ్ గా ఎన్నికైన సందర్భంగా గత 1993 సంవత్సరంలో హన్మకొండలోని రెడ్డి కాలనీకి చెందిన చంద్ర మెమోరియల్ పాఠశాలలో ఆయనతో పాటు పదవతరగతి చదువుకున్న ఆనాటి సహచర మిత్రులు ఆదివారం కాళేశ్వరంలోని ఆయన స్వగృహంలో కలిసి నూతన సర్పంచ్ మోహన్ రెడ్డి వసంత దంపతులను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. కాళేశ్వరం సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా మోహన్ రెడ్డిని అభినందించి ప్రశంసల జల్లులు కురిపించారు. ఈ కార్యక్రమంలో ఆయన మిత్రులు మనోహర్ రావు, శరత్ బాబు, వెంకట్ రావు, విజయేందర్ రెడ్డి, ప్రవీణ్, శిరీష, అనురాధ, మాధవి, వరప్రసాద్, భాస్కర్ రెడ్డి, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నడకతో ఆరోగ్యం పదిలం... కొత్త స్నేహాలకు మార్గం

ప్రముఖ న్యాయవాది భువనగిరి రవీంద్రగుప్తా



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** నడక ప్రతి మనిషి ఆరోగ్యంగాన్నీ పదిలంగ ఉండడానికి కారణమే కాకుండా, కొత్త స్నేహాలతో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని ప్రముఖ అడ్వకేట్ సంఘ గౌరవ అధ్యక్షులు భువనగిరిరవీంద్రగుప్తా అన్నారు. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం మానుకోట శివారు మామిడి తోటలో సంఘం అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య అధ్యక్షత వహించగా సంఘ ప్రధాన కార్యదర్శి ఆకుల శంబయ్య కార్యదర్శి నివేదిక, మహిపాల్ రెడ్డి ఆర్థిక నివేదిక ప్రవేశపెట్టగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ న్యాయవాది, అసోసియేషన్ గౌరవ సలహాదారులు భువనగిరి రవీంద్ర గుప్తా మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా మహబూబాద్ పట్టణంలో వివిన్న రంగాలకు చెందిన వ్యక్తులు జూనియర్ కళాశాలలో వాకింగ్ చేయడం వలన ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచి, నేడు వేలాదిమందికి వాకింగ్ ఆరోగ్యానికి ప్రథమ ఔషధమని భావించడం వలన పలు వాకింగ్ అసోసియేషన్స్ ఏర్పడి పరస్పర సహకారం తో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా అగ్రభాగంలో నిలుస్తున్నారని ఆరోగ్యవంతమైన సమాజానికి ఇలాంటి అసోసియేషన్లు దిక్సూచిగా ఉంటాయని అన్నారు. బెస్ట్ వాకర్స్, సంఘం లో క్రియాశీలకంగా పనిచేసిన వారిని ఘనంగా సన్మానించారు ఈ సమావేశంలో సంఘ బాధ్యులు ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, దాసరి ప్రసాద్, కళ్యం వెంకట్ రెడ్డి, కన్నా అశోక్ బాబు, కపరబోయిన శ్రీనివాస్, ఇమ్మడి కృష్ణ మూర్తి, నక్క .నాగార్జున, సుంకర వెంకటేశ్వర్లు ముల్లంగి వెంకట్రెడ్డి, తీగల రాజేందర్, మార్కండేయులు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 2025 ఉత్తమ క్లబ్‌గా కాళోజీ వాకర్స్ అసోసియేషన్




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** 2025 డిసెంబర్ 20,21 తేదీల్లో ఇంటర్నేషనల్ 34 వ అన్యువల్ కన్వెన్షన్ విశాఖ పట్నంలో జరిగింది. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిస్సా, కర్ణాటక రాష్ట్ర నలుమూలల నుండి వాకర్ అసోసియేషన్లు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల (పరిధిలో)ఏరియా లోనే మహబూబాబాద్ కాళోజి వాకర్స్ అసోసియేషన్ ఉత్తమ క్లబ్ గా 2025 సంవత్సరానికి గాను ఎంపికైంది. ఈ సందర్భంగా 34వ కన్వెన్షన్ లో మెమంటోను అందజేయడం జరిగింది. అంతేకాకుండా ఉత్తమ సేవా క్లబ్ గా రెండవ అవార్డు కూడా లభించింది. అందుకుగాను 5000/ క్యాష్ ప్రైజ్ అందజేయడం జరిగింది. ఈ అవార్డు లు వాకర్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాళోజి వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ డోలి సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు మైస నాగయ్య, అధ్యక్షులు నామిరెడ్డి వెంకటరెడ్డి, కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య లు పాల్గొని అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ డోలి సత్యనారాయణ గారు మాట్లాడుతూ వివిధ ఆరోగ్య ,సామాజిక సేవా కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ మహబూబాబాద్ పట్టణంలో ముందు ముందు కూడా ఇలాగే కొనసాగాలని, గతంలో చేసిన కార్యక్రమాలు అన్నిటికీ సహకరించిన కాళోజీ వాకర్స్ అసోసియేషన్ కమిటీకి, సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## సుదీర్ఘ కాలం రాజకీయ ప్రస్థానంలో రాజీ లేని పోరాటం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మెట్ పల్లి గ్రామంలో ఇటీవల జరిగిన మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో మెట్ పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపురెడ్డి సంజీవరెడ్డి ఘన విజయం సాధించాడు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి లోకుల పోచాలుపై 94 ఓట్ల ఆధిక్యత సాధించి విజయం స్వంతం చేసుకున్నాడు. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎట్టకేలకు సర్పంచ్ మైలురాయిని తాకి తాను ఆశించిన లక్ష్యానికి చేరుకున్నాడు. 1983లో నాటి తెలుగుదేశం పార్టీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన మండల పార్టీ పదవుల్లో మంచి స్వభావం నాయకుడిగా గుర్తింపు పొందగా అప్పటి టిడిపి చేపట్టిన అనేక క్రియాశీలక పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని సేవలు అందించాడు. స్థానికంగా ప్రజల్లో సత్సంబంధాలు కలిగిన ఆయనకు అప్పటి అధికార టిడిపి పార్టీలో నామినేటేడ్ పదవులు మరియు రాజకీయ పదవుల్లో ఆశించిన అవకాశాలు దక్కక నిరుత్సాహానికి గురయ్యాడు. అనంతరం తెలంగాణ స్వ రాష్ట్ర పరిణామాల అనంతరం అధికార బిఆర్ఎస్ పార్టీలో చేరగా ఆ పార్టీలో కూడా రాజకీయంగా ఆయనకు ఆశించిన ఫలితాలు అందకపోవడంతో గత అసెంబ్లీ ఎన్నికల ముందు పట్టు వదలని విక్రమార్కుడిలా మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఆయన రాజకీయ ప్రస్థానంలో చివరకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెట్ పల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడంతో ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సుదీర్ఘ కాలంగా ఎలాంటి పదవులు లేకుండా సాగిన ఆయన రాజకీయ జీవితంలో అనేక మలుపులు, ఒడిదుదుకుల తట్టుకుని తాజాగా మెట్ పల్లి సర్పంచ్ గా ఎన్నిక కావడంతో సంజీవరెడ్డికి ఆదరాభిమానాలతో స్థానిక ప్రజలు, సహచరులు,అభిమానుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## షూటింగ్ పోటీల్లో కాంస్యం సాధించిన యశ్వంత్‌కు సన్మానం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టిపియుఎస్) ఆధ్వర్యంలో మహరాష్ట్ర కొల్హాపూర్‌లో ని ర్వహించిన షూటింగ్ పోటీల్లో కాంస్య పథకం సాధించిన దాసరి వి జయ్ కుమార్–సరస్వతి కుమారుడు దాసరి యశ్వంత్ కు ఘన ంగా సన్మానం చేశారు. జనవరి నెలలో ఉత్తర్ ప్రదేశ్‌లో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నేషనల్ గేమ్స్ షూటింగ్ పో టీల్లో పాల్గొంటున్న సందర్భంగా స్వర్ణ పథకం సాధించాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం తరఫున శుభాకాంక్షలు తెలిపా రు.ఈ కార్యక్రమం స్థానిక హంటర్ రోడ్ లోని నేత హాస్టల్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా టిపియుఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెం కటేశ్వర్లు మాట్లాడుతూ యువ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గౌరవం తీసుకురావడం అభినందనీయమని అన్నారు. యశ్వంత్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ం కన్వీనర్ బిట్ల వెంకటేశ్వర్లు, పూర్ణచంద్రరావు, రామా రవీందర్, చిమ్మని రాజన్ బాబు, వంగరి కోటేశ్వరరావు, కొండబత్తుల రాజేంద్రన్, కొండబత్తుల రాజమౌళి, ఉద్యోగుల సంఘం నాయకులు గు రాజమౌళి,వెంకటేశ్వర్లు, అశోక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జీవితంలో సైక్లింగ్‌ను అలవాటుగా మార్చుకోండి

జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్రారఘు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఫిట్ ఇండియా మిషన్ పిలుపు మేరకు సండేస్ ఆన్ బైస్కిల్" కార్యక్రమాల ద్వారా యువతను క్రీడల వైపు ఆకర్షించి, చైతన్య పరచడమే లక్ష్యంగా బైస్కిల్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని జిల్లా యువజన, కీడల శాఖ అధికారి చిర్ర రఘు తెలిపారు. స్థానిక డా॥ బి.ఆర్. అంబేద్కర్ క్రీడా మైదానం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు బైస్కిల్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో యువత, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యకర జీవనశైలి ప్రాధాన్యతపై ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా చిర్రా రఘు మాట్లాడుతూ, రోజువారీ జీవితంలో సైక్లింగ్‌ను అలవాటుగా మార్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ ఫిట్ ఇండియా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ యువతను క్రీడల పట్ల ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్,కార్యాలయ సిబ్బంది శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం

**ప్రజాపక్షం/మహదేవపూర్:** ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని బిఆర్ఎస్ నాయకులు శ్రీపతి బాపు,కేదారి గీతా బాయి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మాజీ ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పంచాయితీ ఎన్నికల అనంతరం ఏర్పడిన పరిస్థితులపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎదురైన సవాళ్ల,ప్రచారం,ఓటింగ్ సరళి,ఓటమికి గల కారణాలపై లోతుగా విశ్లేషణ చేసామని అన్నారు.ప్రజాసేవ పట్ల తమ సంకల్పం దృఢంగా ఉందని ప్రజల తీర్పును గౌరవిస్తున్నమని అన్నారు.భవిశ్యత్తులో బలంగా సంఘటితంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు.పార్టీని గ్రామస్థాయి నుండి మరింత పటిష్టంగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తామని అన్నారు.రాబోవు ఎన్నికల్లో విజయం సాధించడానికి ఇప్పటి నుండే పక్కా కార్యచరణతో ముందుకు సాగుతామని అన్నారు. ఓటమి తాత్కాలికమే,ప్రజల అనుబంధం శాశ్వతమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాడి గట్టయ్య, రాకేష్, శంకర్, సాజిద్, అన్వర్, లింగాల రామయ్య, నర్సింహస్వామి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎనగండ్లలో ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాపక్షం/కొల్చారం:గెరిల్లా యుద్ధతంత్రంలో ప్రసిద్ధి చెందిమొఘలులను సమర్థవంతంగా ఎదుర్కొన్న యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని విగ్రహ దాత వద్ద ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం మండల పరిధిలోనిఎనగండ్ల గ్రామంలో శివాజీ విగ్రహ నిర్మాణానికి పురోహితులు ప్రసన్న కుమార్ వేదమంత్ర ముల మధ్య భూమిపూజ జరిగింది. ఈ సందర్భంగా విగ్రహ దాత వద్ద ప్రవీణ్ కుమార్ (అయ్యప్ప ఎంటర్ప్రైజెస్)మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ (16301680) గొప్ప మరాఠా యోధుడు, వ్యూహకర్త మరియు మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, బీజాపూర్ సుల్తానేట్ను ఎదిరించి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. ఆయన ధైర్యం, సైనిక నైపుణ్యం, లౌకిక పాలన, మత సహనం మరియు బలమైన ప్రభుత్వ వ్యవస్థకు ప్రసిద్ధి చెందారు, 1674లో రాయగఢ్ ఛత్రపతిగా పట్టాభిషేకం చేసుకున్నారు. తల్లిదండ్రులు తల్లి జిజాబాయి, తండ్రి షాజీ భోంస్లే లకు1630 లో ఫిబ్రవరి 19న శివనేరి కోటలో జన్మించారు.విద్యాభ్యాసం: తల్లి జిజాబాయి, సంరక్షకుడు దాదోజీ కొండేయో పర్యవేక్షణలో శిక్షణ పొంది, రామాయణ, మహాభారతాల నుండి స్ఫూర్తి పొందారు, యుద్ధ విద్యలు నేర్చుకున్నారు. బీజాపూర్ సుల్తానేట్ నుండి స్వతంత్ర మరాఠా రాజ్యాన్ని స్థాపించారు. 1674లో రాయగఢ్ కోటలో పట్టాభిషేకం జరిగింది. మత సహనం, మహిళల పట్ల గౌరవం, బలమైన ప్రభుత్వ వ్యవస్థను స్థాపించారు. ఏప్రిల్ 3, 1680న రాయగఢ్ కోటలో తీవ్ర జ్వరంతో మరణించారు. శివాజీ మహారాజ్ ధైర్యం, దార్శనికత, నాయకత్వ లక్షణాలకు నిదర్శనంగా నిలిచారు. మరాఠా సామ్రాజ్యాన్ని విస్తరించారని ప్రవీణ్ పేర్కొన్నారు.

# నైతిక విలువలు పాటించాలి

## రాజీమార్గంలో కేసులు పరిష్కారం చేసుకోవాలి
## జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ రమేష్ బాబు

ప్రజాపక్షం/భూపాలపల్లి : నైతిక విలువలు పాటించి రాజీమార్గంలో సాగాలని వివాదాలకు తావులేని జీవితాలను గడపాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ రమేష్ బాబు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో ఆదివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోదరా భావంతో కలిసి మెలిసి జీవించినప్పుడు వివాదాలు తలెత్తవని, ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చని అన్నారు. పంతాలకు పోయి కేసుల్లో ఇరికి పోలీస్ స్టేషన్లు కోర్టుల చుట్టూ తిరిగితే నష్టమే తప్ప లాభం ఉండదని, మనశ్శాంతిని డబ్బుని సమయాన్ని కోల్పోవలసి వస్తుందని అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగే లోక్ అదాలత్‌లో కేసుల్లోని ఇరువర్గాల వారి అంగీకారంతో కేసులను కొట్టివేయడం జరుగుతుందని అవకాశాన్ని వినియోగించుకోవాలని జడ్జి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఏ.నాగరాజ్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ఆర్ దిలీప్ కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, డి.ఎస్.పి సంపత్ రావు, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బల్ల మహేందర్, ప్రధాన కార్యదర్శి వి.శ్రవణ్ రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.శ్రీనివాస్, సిఐ నరేష్, ఎస్ఐలు సాంబమూర్తి, సుధాకర్, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



# నేడు ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయండి

## గణపురం గ్రామ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్



ప్రజాపక్షం/గణపురం : జయశంకర్ జిల్లా గణపురం మేజర్ గ్రామపంచాయతీ గ్రామ ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా మన గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర సోమవారం (నేడు) ఉదయం 10:30 నిముషాలకు నూతనంగా ఎన్నికైనా గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ప్రమాణస్వీకారం మహోత్సవం కావున గ్రామంలోని పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు గ్రామ ప్రజలందరు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజవంతం చేయగలరని కట్కూరి రాధిక శ్రీనివాసులు కోరారు.



# లైబ్రరీ ఇంచార్జికి పుస్తకాల అందజేత

ప్రజాపక్షం/లింగాలఘనపురం: జనగాం జిల్లా లింగాలఘనపురం గ్రామం మండలంలోని లైబ్రరీకి వెయ్యేండ్ల చరిత్ర కలిగిన సలాం జనగాం పుస్తక రచయిత శ్రీ సాంబరాజు యాదగిరి గారి ద్వారా రెండు పుస్తకాలను ఏదునూరి వీరన్న ఆధ్వర్యంలో లైబ్రరీ ఇంచార్జి బొడ్డు వెంకన్నకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏదునూరి నరేష్, చెన్నూరు మల్లేశం, ఏదునూరి పద్మ, ఏదునూరు శ్రీశైలం, ఏదునూరి యాదగిరి (లీడర్), ఏదునూరి పెద్ద అంజయ్య, చిన్న అంజయ్య, దేవరకొండ శంకరయ్య, చెన్నూరి లింగరాజు, ఏదునూరి మల్లేశం, ఇటిక్యాల యాదగిరి, గంగాదేవి రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కౌశిక్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/కమలాపూర్ : హుజురాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తక్కలపల్లి సత్యనారాయణ రావు, పింగిలి ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో కమలాపూర్ బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కౌశిక్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు, స్థానిక సర్పంచ్, వార్డు ఎన్నికలలో అత్యధిక సంఖ్యలో గెలుపొందడం అభినందనీయమని సత్యనారాయణ రావు తెలిపారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తోటి నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి లక్ష్మణ్ రావు, తాజా, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నేడే కొలువుదీరనున్న 'పల్లె' పాలకవర్గాలు

## సంగెం మండలంలో సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం
## ఇప్పటికే ఖరారైన ఉప సర్పంచులు.. లాంఛనమే కానున్న ఎంపిక

ప్రజాపక్షం /సంగెం : మండలంలో గ్రామ పాలన కొత్త శోభను సంతరించుకోనుంది. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధమైంది. నేడు ఉదయం నిర్వహించనున్న ప్రత్యేక గ్రామ సభల్లో నూతన ప్రజాప్రతినిధులందరూ మూకుమ్మడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

**ముగిసిన ఉత్కంఠ – ఖరారైన ఉప సర్పంచులు:** సాధారణంగా ఉప సర్పంచ్ ఎన్నికపై చివరి నిమిషం వరకు ఉత్కంఠ ఉంటుంది. కానీ సంగెం మండలంలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో రాజకీయ ఒప్పందాల మేరకు ఉప సర్పంచులు ఎవరనేది ముందే ఖరారు చేశారు. దీంతో నేడు జరగబోయే ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ కేవలం లాంఛనప్రాయంగా ముగియనుంది.

**ముస్తాబైన పంచాయతీలు.. అట్టహాసంగా ఏర్పాట్లు:** మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యాలయాలను మామిడి తోరణాలు, పూలతో అలంకరిస్తున్నారు. ఎంపిడిఓ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లను దగ్గరుండి చూసుకుంటున్నారు. నేడు జరగనున్న ఈ వేడుక కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్పంచులు, వార్డు సభ్యులతో పాటు ఉప సర్పంచులుగా ఎంపికైన వారు కూడా నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. పంచాయతీ కార్యాలయాలను మామిడి తోరణాలు, పూలతో సుందరంగా ముస్తాబు చేయడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది

# కుక్ కమ్ హెల్పర్స్‌కు వంటల పోటీలు



ప్రజాపక్షం/జనగామ: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న కుక్ కమ్ హెల్పర్స్‌కు వంటల పోటీలను నిర్వహించడం జరిగింది. పోటీలలో మొదటిస్థానం లక్ష్మి, రెండవ స్థానం సుజాత, మూడవ స్థానం హాసియ విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో అధికారులు సత్యమూర్తి, శంకర్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రమాణ స్వీకారానికి ముస్తాబైన గ్రామ సచివాలయం




ప్రజాపక్షం/గణపురం : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మూడు విడతల్లో సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికలు కావడంతో సర్పంచ్ వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించాలని ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంతో గణపురం మండలంలోని 17 గ్రామ సచివాలయ కార్యాలయాలను ముస్తాబు చేశారు. కార్యాలయంలో మరమ్మతులు, రంగులు, విద్యుదీకరణ తదితర వాటిని పునరుద్ధరిస్తున్నారు. నేడు(సోమవారం) ప్రమాణ స్వీకారం అనంతరం మొదటి సమావేశాన్ని నిర్వహించనున్నారు. దీంతో పాలకవర్గం బాధ్యతలు చేపడుతుండటంతో గత రెండు సంవత్సరాలుగా పాలకవర్గాలు లేక గ్రామాల్లో అభివృద్ధి పనులు గాడిలో పడనున్నాయి.

# సంజయ్‌నగర్‌లో మెగా వైద్య శిబిరం




ప్రజాపక్షం/జనగామ టౌన్: పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సంజయ్ నగర్ లో మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని 15వ వార్డు మాజీ కౌన్సిలర్ మారబోయిన పాండు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో మంగళంపల్లి రాజు అధ్యక్షతన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పిల్లల వైద్య నిపుణులు, స్త్రీల వైద్య నిపుణులు, న్యూరో, కంటి, పళ్ళ, చర్మ, కిడ్నీ నిపుణులు పాల్గొని 200 మందికి పైగా సంజయ్‌నగర్ కాలనీవాసులకు వైద్యం అందించి ఉచితంగా మెడిసిన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రంజిత్, వైద్యశాలల సిబ్బంది, సోషల్ వాయిస్ ఫౌండేషన సభ్యులు చిన్న, కౌశిక్, వినోద్, రాహుల్, శ్రీచరణ్, తదితరులు పాల్గొన్నారు.

# టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్ రెడ్డిని నియమించాలి




ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్ రెడ్డిని నియమించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు రాజనాల శ్రీహరి కోరారు. ప్రస్తుత పరిస్థితిలో డిసిసి అధ్యక్షుల నిమ్మకాలలో సరిగా లేవని, రేపు రాబోయే ఎలక్షన్‌లో కాంగ్రెస్ విజయకేతనం ఎగరాలంటే తెలంగాణలో రాజేందర్ రెడ్డి టిపిసిసి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలని రాజనాల కోరారు. ఎందుకంటే రాజేందర్ రెడ్డికి 40 సంవత్సరాలు రాజకీయంలో అనుభవం ఉందని, ఎన్నో పదవులుకు వన్నె తెచ్చాదని, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా 15 సంవత్సరాలు, వరంగల్ ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా 15 సంవత్సరాలు, వరంగల్ ఉమ్మడి గ్రంథాలయ చైర్మన్‌గా పది సంవత్సరాలు అనుభవం ఉందన్నారు. టిడిపి హయాంలో అపోజిషన్ నాయకుడిగా ఎన్నో ఆందోళనలు చేశారని, టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ఆందోళనలతో ఎండగడుతూ ఒకే పార్టీలో ఉంటూ ఏ పార్టీకి పోకుండా నిలిచారన్నారు. ఇప్పుడైనా టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలని రాజనాల శ్రీహరి కోరారు.

# పద్మశాలి సంఘం మండల అధ్యక్షునిగా పంతకాని సమ్మయ్య

ప్రజాపక్షం/మహాదేవపూర్ : పద్మశాలి మండల అధ్యక్షునిగా మండలకేంద్రానికి చెందిన పంతకాని సమ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర పద్మశాలి సంఘం జాయింట్ సెక్రెటరీ గాదె రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం జయశంకర్ భూపాలపల్లి పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వెలగొండ రాజేంద్ర ప్రసాద్ నియామక ఉత్తర్వులు జారీ చేసారు. కాటారం సబ్ డివిజన్ ఏరియాలోని పద్మశాలి సంఘాలను బలోపేతం చేయడంలో రాష్ట్ర పద్మశాలి సంఘం జాయింట్ సెక్రెటరీ గాదె రమేష్ చేస్తున్న కృషి ఫలితంగా అన్ని మండలాలలో పద్మశాలి సంఘం కమిటీలను నియమించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రోబోయే రాజయాక పదవులలో పద్మశాలి సంఘం బాధ్యులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని సూచించారు.

# మాజీ మంత్రి ఎర్రబెల్లికి కెసిఆర్ అభినందనలు



ప్రజాపక్షం/దేవరుప్పుల: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మాజీ సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌లు ఫోన్లో అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయితి సర్పంచ్ ఎన్నికలలో అత్యధిక మెజార్టీ సర్పంచ్ స్థానాలు పొందిన సందర్భంగా కెసిఆర్, కెటిఆర్‌లు మాజీ మంత్రి దయాకర్‌రావుకు ఫోన్‌చేసి అభినందించడం జరిగింది.

# నూతన పాలకవర్గానికి సమస్యలతో స్వాగతం

**ప్రజాపక్షం /వేలేరు :** వేలేరు మండలంలోని వివిధగ్రామపంచాయితీలలో నేడు ప్రమాణ స్వీకారం చేయబోతున్న నూతన పాలక వర్గానికి వివిధ రకాలైన సమస్యలతో గ్రామపంచాయితీ కార్యాలయాలు స్వాగతాలు పలుకతున్నాయి గత రెండు సంవత్సరాలుగా అధికారికంగా పాలనా యంత్రాంగం లేకపోవండతో అనేక సమస్యలతో మండల ప్రజలు కొట్టు మిట్టాడుతున్నారని వివిధ గ్రామాల ప్రజల మనో విష్లేషణ,సోమవారం రెండవ విడుత గ్రామపంచాయితీ ఎన్నికలలో గెలుపొందిన సర్పంచ్‌లు,వార్డు సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేయుచున్న సంధర్భంగా వివిధగ్రామాలలోని ప్రజలు పలురకాల సమస్యల పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నామని మండలప్రజలు చర్చించుకుంటున్నారు,వివిధ గ్రామాలలో ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్త,వీధి దీపాల అలంకరణ,వీధికుక్కల స్వైరవిహారంతోపాటుగా,కోతుల బెడద ఎక్కువగా ఉందని ఈసమస్యలపై ఏఒక్క నాయకుడు గత ఎన్నికలలో చర్చించక పోవడం బాధాకరంగా ఉందని వీధి కుక్కల స్వైర విహారానికి ఎంతో మంది బలి కావల్సిన పరిస్థితులు నెలకొనడమేకాకుండా ,కోతుల బెడదతో అనునిత్యం ఇంటిలో నుండి ఆలరుబయటకు వెల్లాలంటేనే నరక ప్రాయంగా ఉందని ముందస్తుగా వీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.అలాగే వేలేరు మండలకేంద్రంలో డ్రైనేజీ వ్యవస్త ఏర్పాటు చేయడంతోపాటుగా పెట్రోల్ పంపు నుండి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు స్ట్రీట్ లైట్ల నిర్మాణమే కాకుండా ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటుగా ప్రభుత్వపాఠశాలల ప్రహారీ గోడ నిర్మాణం చేపట్టి విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన విద్యతోపాటుగా నిరుపేదలకు సమయానుకూలంగా ప్రాధమిక వైద్య ఆరోగ్యకేంద్రంలో వైద్యఅధికారులు వైద్యసౌకర్యలు అందించాలని అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేషపెట్టే సంక్షేమ పథకాలు లర్హులైన ప్రతిఒక్కరికీ అందించాలని కోరుతూ మాంస విక్రయ దారులు వ్యర్ధ పదార్థాలను వాగులలో పడవేయడంవలన ప్రయాణీకులు అనేక ఇబ్బందులకు గురికావడం జరుగుతోంది కనుక వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని ప్రయాణీకులను వీధి కుక్కల స్వైర విహారం,కోతుల బెడద నుండి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వర్ధన్నపేట:**వర్ధన్నపేట టౌన్ సమీపంలో నూతనంగా శ్రీ సాయి ఆదిత్య ఫిల్లింగ్ స్టేషన్ హిందుస్థాన్ పెట్రోలియం బంక్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజును బంక్ యాజమాన్యం వారు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బంక్ యాజమాన్యం సాయి స్వరూప్ సాహితీలను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, బంక్ యాజమాన్యం వారు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/మాదేవపూర్:**పంచాయితీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజా ప్రతి నిధులకు నిర్వహిస్తున్న సన్మాన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని మడేలయ్య గుడి వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో,సర్పంచ్ హసీనా మానో,అక్బర్ ఖాన్ ఇంటివద్ద మిర్చీ రైతుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్,ఉప సర్పంచ్,తుంగల శ్రీజ,వార్డు సభ్యులు అస్రార్ ఖురేషి,హరీష్‌లకు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోత రామకృష్ణ,కవ్వాల శేఖర్,కాసు స్వామి, నాగేష్, మల్లయ్య,చెన్నూరి వెంకటయ్య, ఎజాస్, చాంద్ ఖాన్, అఖ్తర్, చిన్నన్న, చెంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## చుక్కా రామయ్యను కలిసిన గూడూర్ సర్పంచ్ దంపతులు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో గూడూరు గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన మాచర్ల స్వరూప పుల్లయ్యలు ఆదివారం ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యను హైధరాబాద్‌లో కలిశారు. సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంలో గూడూరు గ్రామానికి చెందిన విద్యావేత్త చుక్కా రామయ్య ఆశీస్సులు తీసుకున్నరు.

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ రంగశాయిపేటలోని ఆర్.ఆర్. గార్డెన్స్‌లో మామునూరు క్యాంపు ప్రభుత్వ పాఠశాల 7వ తరగతి (1975–76 బ్యాచ్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరై, తన బ్యాచ్ సభ్యులతో కలిసి గడిపిన మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులందరిని శాలువాలతో సత్కరించి, షీల్డులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, తన జీవితానికి పునాది వేసినది ఇదే ప్రభుత్వ పాఠశాలని పేర్కొన్నారు. ఈ పాఠశాల తమకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా, క్రమశిక్షణ, విలువలు అలవర్చిందని తెలిపారు. పాఠశాల దశలోనే హాకీ క్రీడాకారుడిగా తన ప్రతిభను వెలికి తీసి, ఒక ఎస్ఐ నుంచి సీపీ స్థాయి వరకు సేవలందించి, నేడు ప్రజాప్రతినిధిగా నిలిచే స్థాయికి చేరుకోవడంలో గురువుల పాత్ర అమూల్యమని అన్నారు. విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు జీవితాంతం నిలిచిపోతాయని పేర్కొంటూ, ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు మధుర జ్ఞాపకాలను మరింత సజీవం చేసి, పరస్పర అనుబంధాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. ప్ర భుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా తోటి మిత్రులు ఎమ్మెల్యే నాగ రాజును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు తోటి మిత్రులు టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నా రు.

## జిపిల పాలకవర్గాలు కొలువు తీరేది నేడే



**ప్రజాపక్షంపరకాల/నడికుడ :** గ్రామపంచాయతీల పాలకవర్గం నేడు కొలువుదీరనుంది. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన సర్పంచులు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో గత రెండు సంవత్సరాలుగా ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న పంచాయతీలు నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రమాణ స్వీకారంతో విముక్తికానున్నాయి. దీంతో గ్రామపంచాయతి కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి.తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల జరిగిన మూడు విడుదల పంచాయతీ ఎన్నికలలో భాగంగా హన్మకొండ జిల్లాలోని పరకాల డివిజన్లో గల పరకాల , నడికూడా , శాయంపేట, ఆత్మకూర్, దామేర మండలాలలోని గ్రామపంచాయతీలలో నూతన పాలకవర్గాలు కొలువుదీరునున్నాయి. మూడో విడత ఎన్నికలు హన్మకొండ జిల్లాలోని కొన్ని మండలాలలో బుధవారం ఎన్నికలు జరగగా శనివారం తెలంగాణ వ్యాప్తంగా నూతన పంచాయతీల పాలకవర్గాలు కొలువు తీరుతాయని అనుకున్నప్పటికీ వాయిదా పడ్డాయి. ముహూర్తాలు బాగా లేవన్న ఉద్దేశంతో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల విన్నపాల మేరకు తెలంగాణ ప్రభుత్వం నేటికీ వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలలో హోరావూరిగా జరిగిన పోరులో విజేతలైన సర్పంచులు ఆయా పంచాయతీలలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పరకాల మండలంలో 10 , గ్రామ పంచాయతీలు నడికుడ మండలంలో 14 గ్రామ పంచాయతీలు శాయంపేట మండలంలో 24 గ్రామపంచాయతీలు దామర మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఆత్మకూరు మండలంలో ఉన్న 12 పంచాయతీలలో ఇటీవల ఎన్నికైన సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నడికూడా మండలంలోని కౌకొండ గ్రామంలో జరిగిన పంచాయతీ ఎన్నికలలో బిజెపి కాంగ్రెస్ లు అపవిత్ర పొత్తు పెట్టుకుని పోటీచేసినప్పటికీ బిఆర్ఎస్ అభ్యర్థి ఓదెల శ్రీలత భాస్కర్ గెలుపొందారు ఆమె గెలుపు నడికుడ మండలం తో పాటు పరకాల మండలంలోని వివిధ పార్టీల నాయకుల ప్రజలలో తీవ్ర చర్చినియాంశమైంది.

## కురుమ కుల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా కంచు ప్రభాకర్

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** కురుమ కుల సంక్షేమ సంఘ అధ్యక్షునిగా కంచు ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఆదివారం హనుమకొండలోనివిద్యుత్ భవన్‌లో జరిగిన కురుమ కుల సంక్షేమ సంఘం ఎన్నికలలో కంచు ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. మంగ రాజన్న, కోరె బిక్షపతి ఎన్నికల పర్యవేక్షకులుగా నిర్వహించడం జరిగింది. వీరి పర్యవేక్షణలో ప్రధాన కార్యదర్శిగా మంగ రాజయ్య, ఆర్థిక కార్యదర్శిగా ఈర రవీందర్ ఎన్నుకోవడం జరిగినది. గౌరవ అధ్యక్షులుగా ఎగటి రాజమల్లు, సంయుక్త కార్యదర్శిగా సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా ముది గిరి ఓదెలు, దయ్యాల ప్రభాకర్, అమ్మ జగన్, పోత రాజు రమేష్, బెల్లం బాలరాజ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కంచు ప్రభాకర్ మాట్లాడుతూ 2015లో 66 మందితో ఏర్పడిన సంక్షేమ సంఘం అంచలంచలుగా ఎదుగుతూ రాష్ట్రంలో కురుమ కుల సంక్షేమ సంఘానికి ఒక గుర్తింపు రావడం మాకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. మా సంఘం ద్వారా కుల బాంధవులకు వివాహ సంబంధాలు ఏర్పరచడం, కులములో జరిగినటువంటి ఆటుపోట్లకు ముందుండి పరిష్కరించడం, కురుమ కుల విద్యార్థులకు సలహాలు సూచనలు చేస్తూ చదువులో ఉన్నత శిఖరాలు అందుకునే విధంగా సహకరించడం చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. సంక్షేమ సంఘ కమిటీకి మమ్ములను ఎన్నుకున్న కమిటీ సభ్యులకు మా తరఫున ధన్యవాదములు. ఈ సందర్భంగా కురుమ కుల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## 23న "మీ డబ్బు, మీ హక్కు" పై ప్రత్యేక అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/ములుగు:**కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా "మీ డబ్బు మీ హక్కు" అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకొని ఆర్థికపరమైన ఆస్తు లు సమస్యను పరిష్కరించేందుకు చేపట్టిన కార్యక్రమం ఈ నెల 31 వరకు కొనసాగుతుందని లీడ్ బ్యాంక్ మేనేజర్ జి జయప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాలు ఆ పైన క్లెయిమ్ చేసుకొని బ్యాంక్ పొదుపులు, ఇన్సూరెన్స్ ఖాతాలు, తదితరాలు క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలనే లక్ష్యంతో ఆర్‌బిఐ సెబి, ఐఆర్‌డిఏ, బ్యాంకులు ఉమ్మడి శిభిరాలు నిర్వహిస్తాయని ఇందులో భాగంగా ఈ నెల 23వ తేదీన జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు శిభిరం నిర్వహించనున్నట్లు ఎల్‌డిఎం తెలిపా రు. ఆర్థికపరమైన ఆ స్తులు వాస్తవ యజమానులు వాటిని పొందేందుకు శిభిరంలో బ్యాంక్ శాఖ, భీమా సంస్తని సం ప్రదించి సలహాలు తీసుకొని ఈ అవకాశాన్ని చేసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## పార్థివదేహానికి బిఅర్ఎస్ నాయకుల నివాళులు

**ప్రజాపక్షం/మంగపేట:**మండలంలో బిఅర్ఎస్ పార్టీ మంగపేట గ్రామ కమిటీ అధ్యక్షులు నూనె లింగయ్య తండ్రి నూనె కనకయ్య ఆదివారం ఉదయం మృతి చెందాగా కనకయ్య మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చిచిన బిఅర్ఎస్ పార్టీ నాయకులు తాటి కృష్ణ చిట్టీమల్ల సమ్మయ్య, అయూబ్ , యాలవర్తి శ్రీనివాస్, బుట్టో గుడివాడ శ్రీహరి, సత్యానారాయణ, సింగరిబోయిన నర్సయ్య, కాటూరి సుగుణ, ఉడుగుల శ్రీనివాస్, రూప భద్రయ్య, పుల్లారావు పాల్గొన్నారు.

## నేడు పంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

**ప్రజాపక్షం/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నేటి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో కాళేశ్వరం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

## నూతన సర్పంచులను సన్మానించిన మున్నూరు కాపు సంఘం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :**నిజాంపేట మండల పరిధిలోని ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన నస్కల్ సర్పంచి నాతి అంజమ్మ లక్ష్మణ్ గౌడ్, నందిగామ గ్రామ సర్పంచ్ శేరి స్వప్న రమేష్ లను నస్కల్ గ్రామ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతన సర్పంచులుగా గెలుపొంది రేపటి రోజు ప్రమాణ స్వీకారాలు చేసి గ్రామాల అభివృద్ధి చేయాలని ప్రజలభూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం సమస్యలు పరిష్కరించి ప్ర జల మనసులు గెలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి లి ంగం, రాజు, దేవయ్య, శ్రీనివాస్, నారాయణ, బాలరాజ్, సిద్ధ రా ములు, సుమన్, చంద్రయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధపోరాట యోధుడు సింగు నర్సయ్య సతీమణి సత్తెమ్మకు నివాళి

**ప్రజాపక్షం/మహబూబాబాద్:**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు సింగు నరసయ్య సతీమణి సింగు శ్రీనివాస్, సింగు రమేష్ ల తల్లి సింగు సత్తెమ్మ గారి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరై సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మానుకోట ప్రజా యుద్ధనౌక బి అజయ్ సారథి రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్ రేషపల్లి నవీన్ వరిపెల్లి వెంకన్న వీరవెల్లి రవి మేక వీరన్న జలగం ప్రవీణ్ గాదం శ్యాం ప్రసాద్ యాదవ్ తండా శ్రీనాథ్ లింగాల విజయ్ గుండోజు రమేష్ పాల్గొన్నారు